ఉపాధి హామీ పనుల ప్రణాళిక ఖరారు!

- 2025–26 ఆర్థిక సంవత్సరానికి పనిదినాల గుర్తింపు
- మొక్కలు నాటడం, చెరువుల పూడికతీత
- ఫీడర్ కాలువలు, కందకాలకు ప్రాధాన్యం



సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2025–26 ఆర్థిక సంవత్సరంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి సంస్థలు (డీఆర్డీఏ)కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేశాయి. ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు ఉపాధి కూలీలు చేపట్టనున్న పనులను కూడా గుర్తించారు.

- శివారు మేడ్చల్, రంగారెడ్డిజిల్లాల్లో 1,78,867 మంది కూలీలకు 11.83 లక్షల పనిదినాల్లో రూ. 27.95 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులు (మేటీరియల్ కాంపోండ్‌తో కలిపి)చేపట్టాలన్న లక్ష్యాన్ని అధిగమించేందుకు కసరత్తు చేస్తున్నారు.
- మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 17,832 మంది కూలీలకు 1.71 లక్షల పనిదినాల్లో రూ.5.30 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనుల (మేటీరియల్ కాంపాండ్‌తో కలిపి)నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు. కూలీలకు 100 రోజులు పనిని కల్పించడం ద్వారా పేదల జీవనోపాధిని మెరుగు పరిచేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.
- నగర శివారు జిల్లాల్లో మొత్తంగా 620 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఇటీవల ప్రభుత్వం 40 గ్రామ పంచాయతీలను సమీపంలోని 11 పురపాలక సంఘాల్లో విలీనం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న 580 గ్రామపంచాయతీల్లోనే ఉపాధి హామీ పనులు జరిగేలా ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి సంస్థలు కార్యాచరణ కార్యక్రమాన్ని ఖరారు చేస్తున్నాయి.

పనులు ఇలా..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు మేడ్చల్ జిల్లాలో 2,369 మంది కూలీలకు 37,631 పనిదినాలను కల్పించడం ద్వారా సామగ్రితో కలిపి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ అభివృద్ధి పనుల (మేటీరియల్ కాంపాండ్‌తో కలిపి) విలువ రూ.4 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతిరోజు 127 నుంచి 282 మంది కూలీలు ఉపాధి పనుల్లో నిమగ్నమై పనిచేస్తున్నారు.

రూ.22.64 కోట్ల మేర పనులు..

రంగారెడ్డి జిల్లాలో కూడా ఇప్పటి వరకు ఉపాధి కూలీలకు రూ.10.12 లక్షల పనిదినాలను కల్పించిన డీఆర్‌డీఏ రూ.22.64 కోట్ల అభివృద్ధి పనులు (మేటీరియల్ కాంపాండ్‌తో కలిపి)చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా చెరువు పూడికతీత పనులతో పాటు కందకాలు తవ్వడం, ఫీడల్ కాలువల నిర్మాణం, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వడం వంటి పనులను కూలీలు చేపట్టారు.

ఉపాధి హామీ పథకంలో గుర్తించిన పనులు..

నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి,రంగారెడ్డి జిల్లాల్లో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తింపు ప్రక్రియను అధికార యంత్రాంగం ప్రారంభించింది. ఉపాధి పనుల్లో భాగంగా ఊట కుంటలు, కందకాలు తవ్వడం, ప్రభుత్వ స్థలంలో మొక్కలు పెంచడం, పల్లె పకృతి వనాలు, రైతు కళ్లాలు, ఇంకుడు గుంతలు, ప్రభుత్వ స్థలంలో నేల చదును, ఎండిపోయిన బోరుబావుల రీచార్జి, వైకుంఠ దామాలు, ప్రభుత్వ సంస్థలకు రోడ్లు వేయడం, డంపింగ్ యార్డులు, కామన్ ల్యాండ్ సోక్ ఫిట్స్, కొత్తగా నిర్మించిన రహదారులపై గ్రావెల్ , కంపోస్ట్ ఎరువుల గుంతలు, ఫీడర్ కాలువలు వంటి పనులను కూలీలు చేపట్టనున్నారు.

- పశువులు, గొర్రెలు, మేకల తోట్ల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం, తాటివనాలు, చేపల కుంటలు, మిషన్ భగీరథ కోసం కందకాలు, మైనర్ ఇరిగేషన్ కాలువల్లో పూడికతీత, వనమహోత్సవంలో మొక్కలు నాటేందుకు గుంతలు తీయడం వంటి ఉపాధిపనులు కూడా కూలీలు చేపట్టనున్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే కాలనీల పర్యటన


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ నర్సింహాయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే కాలనీల్లో పర్యటిస్తున్నానని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని మైత్రీవనం కాలనీ, రాంరెడ్డి కాలనీ, నాగిరెడ్డి కాలనీలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాల సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి త్వరగా పరిష్కారిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు జగన్‌రెడ్డి, హన్మంతరావు, మహేశ్, సత్తిరెడ్డి, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సంఘం కార్యవర్గం ప్రమాణస్వీకారం


ప్రమాణ స్వీకారం చేసిన ఊట్ల చంద్రారెడ్డి తదితరులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన ఊట్ల చంద్రారెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా భగవంత్‌రెడ్డి, కోశాధికారిగా నర్సిములు ముదిరాజ్, కన్వీనర్‌గా మారెళ్ల శ్రీనివాసరావు చేశారు. అదేవిధంగా పాపిరెడ్డినగర్ శ్రీ వీరాంజనేయ శివాలయం చైర్మన్‌గా ధర్మారావు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ అధ్యక్షుడిగా ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి రెడ్డి, క్యాషియర్‌గా శంకర్‌రెడ్డిని కాలనీవాసుల సమక్షంలో కాలనీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి నియమించి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా కాలనీవాసులను కలుపుకుని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



కూకట్‌పల్లి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్నేహ మోడల్ స్కూల్ వార్షికోత్సవానికి హాజరై చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం కూకట్‌పల్లిలోని శ్రీ పోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. కూకట్‌పల్లి, వివేకానందనగర్ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, రోజాదేవి రంగారావుతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

'ప్రజావాణి'లో 22 ఫిర్యాదులు



కుత్బుల్లాపూర్: జంట సర్కిల్ పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 15 ఫిర్యాదులు వచ్చాయి. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 8 ఫిర్యాదులు అందాయి. వాటిలో ఇంజినీరింగ్ 3, టౌన్ ప్లానింగ్ 3, ట్యాక్స్ సెక్షన్‌కు సంబంధించి 2 ఫిర్యాదుల వచ్చాయి. అలాగే గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో 7 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో టౌన్ ప్లానింగ్‌కు 6, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 1 ఫిర్యాదు వచ్చింది. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు అర్జీలు పంపిస్తామని వారు తెలిపారు.

జలమండలి కార్యాలయంలో..

చింతల్: కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో 7 ఫిర్యాదులు అందాయి. గాజులరామారం వీనస్ ఎన్‌క్లేవ్, కుత్బుల్లాపూర్ పద్మానగర్‌లో లోప్రెషర్ ఉందని ప్రతాప్‌రెడ్డి, సత్తిరెడ్డి, తాగునీటి సరఫరా కావడం లేదని న్యూ వివేకానందనగర్‌కు చెందిన దాస్‌గౌడ్, సాయినగర్‌కు చెందిన ఉదయ్, తాగునీటితో మురుగునీరు కలిసి సరఫరా అవుతోందని మహేంద్రనగర్‌కు చెందిన మల్లేశ్ ఫిర్యాదు చేశారు. వీటిపై స్పందించిన జలమండలి జీఎం అశోక్ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత సెక్షన్ల మేనేజర్లను ఆదేశించారు.

మెగా జాబ్ ఫెయిర్ పోస్టర్ ఆవిష్కరణ


మెగా జాబ్ ఫెయిర్ పోస్టర్ ఆవిష్కరించిన వీసీ ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్‌రెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ ఆధ్వర్యంలో నిపుణ, సేవా ఇంటర్నేషనల్ సహకారంతో మార్చి 1న మెగా జాబ్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు వీసీ టి. కిషన్ కుమార్ రెడ్డి తెలిపారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో ఇతర అధికారులతో కలిసి జాబ్ ఫెయిర్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఐటీ, ఫార్మా, ఇంజినీరింగ్, బ్యాంకింగ్, రిటైల్, తయారీ, మేనేజ్‌మెంట్ రంగాల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టర్ ప్రొఫెసర్ కె. విజయ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వరరావు, నిపుణ ఫౌండేషన్ డైరెక్టర్ సుభద్రారాణి మయారాం, ఇండస్ట్రీయల్ ఇంటరాక్షన్ డైరెక్టర్ డా. ఏ. రజనీ, డిప్యూటీ డైరెక్టర్ డా. జె. సురేశ్ కుమార్ పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి


ఎల్లమ్మబండ జడ్పీ పాఠశాలలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతం


ల్యాబ్‌ను ప్రారంభించి పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు

- మేడ్చల్–మల్కాజ్‌గిరి కలెక్టర్ గౌతం
- ఎల్లమ్మబండ జడ్పీ పాఠశాల తనిఖీ

అల్విన్‌కాలనీ: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతం పేర్కొన్నారు. కూకట్‌పల్లి మండలం ఎల్లమ్మబండలోని జడ్పీ పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. భవిష్యత్‌లో ఏం చదువుతారు..ఏ గ్రూపు తీసుకుంటారు..సిలబస్ పూర్తి అయిందా..రివిజన్ ఎలా జరుగుతుందని..స్కూల్‌లో వసతులు.. భోజనం ఎలా ఉంటుంది..? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే భవిష్యత్తు ఉంటుందని కష్టపడి చదవాలన్నారు. అంతకు ముందు ఇంటెలిజెన్స్ టూల్ ద్వారా, పాఠశాలలో భాషా గణిత సామర్థ్యాల్లో వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి ప్రత్యేకమైన టూల్ ద్వారా విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ప్రతి విద్యార్థి 20 నిమిషాల నిడివితో పాఠాలు వినాలని, తప్పనిసరిగా 4 రోజులు హాజరయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ శ్యాంప్రకాశ్, తహసీల్దార్ స్వామి, డీఈఓ విజయకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓపెన్ నాలా పరిశీలన


చెత్తాచెదారం పేరుకుపోయిన నాలాను పరిశీలిస్తున్న ఏఈలు రంజిత్, వర్షిణి, కార్పొరేటర్

మోతీనగర్: 'నాలాల్లోనే చెత్త' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జీహెచ్‌ఎంసీ మూసాపేట, అల్లాపూర్ ఏఈలు రంజిత్, వర్షిణితో పాటు మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ సోమవారం గూడ్స్‌షెడ్ లోపలి ప్రాంతాన్ని పరిశీలించి రైల్వే జూనియర్ ఇంజినీర్ నవీన్‌తో ఫోన్లో మాట్లాడి సమస్యను వివరించారు. 2 రోజుల్లో పరిష్కారం లభించేలా కృషి చేస్తానని ఆయన హామీనిచ్చారు. త్వరలోనే ఇళ్ల మధ్యనున్న ఓపెన్ నాలాలోని పూడికతీత పనులు చేపట్టి చెత్తాచెదారాన్ని తరలించేలా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, డివిజన్ జనరల్ సెక్రటరీ రవిగౌడ్, సెక్రటరీ కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీబీఏ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి


జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. వెంకటేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో బీబీఏ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం నాయకులు కోరారు. ఈమేరకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. వెంకటేశ్వరరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాహుల్ నాయక్, శివకృష్ణ మాట్లాడుతూ.. యూసీఎంహెచ్ విభాగంలో సౌకర్యాల కొరత ఉందన్నారు. నియామక కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు ప్రత్యేక ప్లేస్‌మెంట్ కార్యాలయం లేదన్నారు. అదేవిధంగా రెగ్యులర్ ఫ్యాకల్టీని నియమించి, బీబీఏ విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు కాశీనాథ్ రెడ్డి, వర్ధన్, నితిన్, బ్రహ్మం, అరవింద్ కుమార్, ధనుంజయ్, తనుజ్, గగన్, దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కంపెనీలో అగ్ని ప్రమాదం


మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రశాంత్‌నగర్‌లో గల ఓ ప్లాస్టిక్ కంపెనీలో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రశాంత్‌నగర్‌లో ఎంఎస్ పాలీమర్స్ కంపెనీలో ప్లాస్టిక్ గ్లాసులు తయారు చేస్తుంటారు. ఆదివారం రాత్రి కార్మికులు వెళ్లిన తర్వాత షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి కంపెనీలోని ప్లాస్టిక్ గ్లాసులు, ముడిసరుకు కాలిపోయింది. స్థానికుల సమాచారం మేరకు కూకట్‌పల్లి, సనత్‌నగర్, బంజారాహిల్స్ అగ్నిమాపక సిబ్బంది మూడు వాహనాల్లో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే ప్రమాదం జరిగిన సమయంలో అగ్ని మాపక సిబ్బంది కంపెనీ యజమానిని ఫోన్లో సంప్రదించినా స్పందించలేదని, సోమవారం సాయంత్రం వరకు కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కానీ, ఫైర్‌స్టేషన్‌లో కానీ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మోతీనగర్: మరమ్మతుల కారణంగా ఈనెల 25న పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాకేశ్ గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివేకానందనగర్, పర్వత్‌నగర్, ప్రభుత్వాసుపత్రి ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి 1 గంట వరకు అలాగే మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు గాయత్రీనగర్, జ్యోతినగర్, చంద్రాగార్డెన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

27న భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ (పీఎఫ్) కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 27న భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డా. హేమంత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లోని రెండో అంతస్తులో గల పీఎఫ్ కార్యాలయంలో, అపోలో ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, కేపీహెచ్‌బీ ఫేజ్ 1, ధర్మారెడ్డి కాలనీలో ఉదయం 10 గంటలకు అదాలత్ ఉంటుందని పేర్కొన్నారు. ఖాతాదారులు సమస్యలు పరిష్కరించుకోవడమే కాకుండా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు.

కల్యాణోత్సవాలకు రండి


రవీందర్‌ను ఆహ్వానిస్తున్న శేఖర్‌యదవ్

జగద్గిరిగుట్ట: మహా శివరాత్రిని పురస్కరించుకుని జగద్గిరిగుట్ట కొండపై ఉన్న మల్లికార్జున స్వామి ఆలయంలో ఈనెల 26న మల్లికార్జునస్వామి, భ్రమరాంబ కేతమ్మల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడు చింతల రవీందర్, విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్‌ను సోమవారం కలిశారు. కల్యాణోత్సవాలకు రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ అధ్యక్షుడు సమ్మయ్య యాదవ్, సత్యనారాయణ యాదవ్, కుమార్ యాదవ్, రాజుయాదవ్, సింహయాదవ్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కుత్బుల్లాపూర్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో పలు కాలనీల ప్రజలు సోమవారం ఆయనను కలిసి పలు సమస్యలను దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించి మాజీ ఎమ్మెల్యే అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. నిధులు లేక కొన్ని ప్రాంతాల్లో పనులు జరగడం లేదని అధికారులు వివరణ ఇవ్వగా ఈ విషయమై మంత్రిని కలిసి నిధులు మంజరయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

'హామీలు విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం'


యువకులకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, రాగిడి లక్ష్మారెడ్డి

కూకట్‌పల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని, అందుకే ప్రజలు మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. బాలానగర్ డివిజన్‌లో గిరి సాగర్, రాజు సాగర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ యూత్ నాయకుడు మధు ఆధ్వర్యంలో 100 మంది యువకులు సోమవారం బీఆర్‌ఎస్‌లో చేయగా రాగిడి లక్ష్మా రెడ్డితో కలిసి ఆయన వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాధవరం మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 14 నెలల్లో నియోజకవర్గానికి మొండి చేయి చూపిందన్నారు. తప్పుడు వాగ్దానాలు చేసిన కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు ముందున్నాయని, అందుకే యువకులు ఆ పార్టీకి రాజీనామా చేసి తమ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు


పనులు ప్రారంభిస్తున్న కృష్ణచాముండేశ్వర మహర్షి

మూసాపేట: మూసాపేట, కైత్లాపూర్ గ్రౌండ్‌లో చాముండేశ్వర పీఠాధిపతులు కృష్ణచాముండేశ్వర మహర్షి ఆధ్వర్యంలో మహా శివరాత్రి వేడుకలు జరగనున్నాయి. ఈమేరకు సోమవారం కైత్లాపూర్ గ్రౌండ్‌లో మహర్షి చేతుల మీదుగా పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంభో స్వయంభు అహోరాత్ర అభిషేకాలు శివరాత్రి రోజు నిర్వహిస్తాన్నామన్నారు. భక్తులు కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొనాలని కోరారు. అలాగే 26న మహ శివరాత్రి సందర్భంగా విశేష పూజలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్, మాజీ కార్పొరేటర్ బాబూరావు, నాయకులు ఉప్పల చంద్రశేఖర్ గుప్తా, రవిగౌడ్, కృష్ణయాదవ్, అబ్బాస్ పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం జరగకుండా చూస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్


తహసీల్దార్ మతిన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దుండిగల్: రైతులకు అన్యాయం జరగకుండా చూస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ దుండిగల్ గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 453, 454 లోని చిన్న చెల్క భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బోర్డులు ఏర్పాటు చేయడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. దీంతో దుండిగల్ వార్డు కార్యాలయంలో రైతులతో సోమవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..50 ఏళ్ల క్రితం సాగు కోసం నిరుపేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని చూస్తోందని, వాటిని చట్టపరంగా రక్షించుకుందామని పిలుపునిచ్చారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్‌తో సమావేశమై సమస్య పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు.

రైతులతో కలిసి తహసీల్దార్‌తో సమావేశం

ఎమ్మెల్యే రైతులు, స్థానిక నేతలతో కలిసి గండిమైసమ్మ–దుండిగల్ తహసీల్దార్ సయ్యద్ మతీన్‌తో సమావేశమయ్యారు. దుండిగల్ గ్రామంలోని సర్వేనంబర్ 453, 454 లోని భూములు, రైతులకు సంబంధించిన వివరాలను పూర్తిగా సేకరించి వారికి అన్యాయం జరగకుండా చూడాలని తహసీల్దార్‌కు సూచించారు. అవసరమైతే ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పాక్స్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, మాజీ కౌన్సిలర్లు జక్కుల కృష్ణ యాదవ్, అమరం గోపాల్ రెడ్డి, శంభీపూర్ కృష్ణ, జక్కుల విజయ శ్రీనివాస్, ఆనంద్, మాజీ ఎంపిటీసీ బండారి మహేశ్, వెంకటేశ్, నాయకులు వీరాస్వామి, కె.వెంకట్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాలాలో పూడిక తీయరూ..!


నాలాలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు

జీడిమెట్ల: ఫాక్స్‌సాగర్ నుంచి సుభాష్‌నగర్ వైపు నిర్మించిన నాలా చెత్తాచెదారంతో నిండిపోయింది. ఫాక్స్‌సాగర్ చెరువు నిండినప్పుడు నీరు బయటకు వెళ్లేలా ఫాక్స్‌సాగర్ నుంచి సుభాష్‌నగర్ వెంకటాద్రినగర్ వరకు రెండేళ్ల క్రితం ఓపెన్‌నాలా ఏర్పాటు చేశారు. అయితే సదరు నాలా చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో స్థానికంగా ఉన్న స్క్రాప్ దుకాణాదారులు నాలాలోనే చెత్తాచెదారాలను వేస్తున్నారు. ఇప్పటికైనా కుత్బుల్లాపూర్ మున్సిపల్ అధికారులు స్పందించి నాలాలోని ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి నాలా చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.